క్లుప్తంగా

ఘనంగా ఫ్రెషర్స్ డే



గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐడీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవిశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వైద్య వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్యులు ఆలోచనతో, చేతులతో, మనసుతో సేవలందించి ఎక్సలెంట్ డాక్టర్లుగా రాణించాలన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలో డాక్టర్ రవి శంకర్ మొక్కలు నాటారు. డైరెక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, టీడీపీ నేత పట్టాభి పాల్గొన్నారు. అతిథుల చేతుల మీదుగా వైద్య విద్యార్థులకు వైట్ కోట్‌లు అందజేశారు.

వైభవంగా పుష్పయాగం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సుందరకాండ పారాయణం కొనసాగుతోంది. తొలుత స్వామివారికి ఐదు వేల గులాబీలు, ఐదు వేల చామంతులు వివిధ రకాల పరిమళభరిత పూలతో వేద పండితులు పుష్పయాగం నిర్వహించారు. అనంతరం భక్తులచే శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి పనుల గుర్తింపు గ్రామసభలు

ఉంగుటూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామసభలు గ్రామాల్లో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ తెలిపారు. గ్రామసభల వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. 15న పెద్ద అవుటపల్లి, ఆత్కూరు, నారయ్య అప్పారావుపేట, పొట్టిపాడు, కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఉంగుటూరు, లంకపల్లి, ముక్కపాడు, 16న తేలప్రోలు, గారపాడు, పొణుకుమాడు, తుట్టగుంట, నందమూరు, మధిరపాడు, చాగంటిపాడు, ఇందుపల్లి, వేమండ, 18న నాగవరప్పాడు, వెల్దిపాడు, ఎలుకపాడు, వెన్నూతల, మానికొండ, తరిగొప్పల, వేంపాడు, చికినాల, బొకినాల గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో సభలు నిర్వహించి పనులు ఆమోదిస్తారని చెప్పారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు వైద్యశిబిరం

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో శుక్రవారం కంటి, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఇమ్మిడిశెట్టి ఉమాపార్వతి పిల్లలు కానూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతున్నారు. పిల్లలను చూడటానికి ఉమాపార్వతి తన గ్రామం నుంచి వచ్చింది. తాడిగడప సెంటర్ 100 అడుగుల రోడ్డులో ఆటో ఎక్కుదామని నిలబడి ఉండగా కారు వేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామానికి చెందిన పొట్లూరి తేజశ్రీకి 2019వ సంవత్సరంలో గుంటూరుకు చెందిన సైదారావుతో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త గుంటూరులో హెయిర్ కటింగ్ సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే భర్త తనకు పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త బదవమ్మ కూడా వేధిస్తూ అదనపు కట్నం తీసుకురమ్మని తేజశ్రీని ఇబ్బందులకు గురి చేయసాగింది. పెద్ద మనుషులు నచ్చచెప్పిన అత్తింటి వారిలో మార్పు రాలేదు. దీంతో తేజశ్రీ గత మూడు నెలల క్రితం పుట్టింటికి వచ్చేసింది. అత్తింటి వేధింపులపై పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటి వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

- 'సాక్షి' ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం
- విద్యార్థులకు పలు అంశాల్లో పోటీల నిర్వహణ
- విజేతలకు ఆట వస్తువుల బహూకరణ



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న బాపిరాజు, గ్లోరి తదితరులు



మచిలీపట్నంటౌన్: అనాథ బాలలు, వీధి బాలల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. కేరింతలు కొడుతూ ఆట పాటలతో సందడిచేశారు. స్థానిక పోర్టురోడ్డులోని అనాథ పిల్లల ఆశ్రమమైన బాల సదనంలో 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవం ఇందుకు వేదికైంది. బాలల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం పోర్టురోడ్డులోని అనాథ పిల్లల ఆశ్రమమైన బాల సద నంలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, టెన్నికాయిట్, స్కిప్పింగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆటల పోటీల్లో విజేతలకు కమిషనర్ బాపిరాజుతో



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న చిన్నారులు

పాటు ఐసీడీఎస్ సీడీపీఓ గ్లోరి, ఐసీడీఎస్ జిల్లా కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి, బాలసదనం సూపరింటెండెంట్ గంగాభవాని, ఐసీపీఎస్ ప్రతినిధి ప్రశాంతి బహుమతులను అందజేశారు. తొలుత కమిషనర్ బాపిరాజు కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ.. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోందన్నారు. బాలల దినోత్సవాన్ని 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో బాలసదనంలో నిర్వహించడం ముదావహమన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను ఇచ్చి వారిని ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. 'సాక్షి' దినపత్రిక వార్తలు అందించటంతో పాటు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' రిపోర్టర్ ఎస్‌పీ యూసుఫ్, సాక్షి సిబ్బంది, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ బాపిరాజు బాలసదనంలో ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

గన్నవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్లాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025–26 కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, ఎంపీడీఓ టి.స్వర్ణలత, ఈఓపీఆర్డీ టి.భారతి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

జీపీడీపీ అమలుకు చర్యలు

విజయవాడరూరల్: ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) అమలు జరిగేందుకు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే జీపీడీపీ శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో ప్రజలతో ముందుగా గ్రామసభ, బాల సభ, మహిళా సభలను నిర్వహించాలన్నారు. ఆ సభలలో చర్చించిన అంశాలపై ప్రణాళికలను తయారు చేయాల్సిన బాధ్యత ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందన్నారు. గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయలకు సంబంధించిన అర్జీలను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈఓఆర్డీ ఎంవీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గతేడాది జీపీడీపీ అమలు చేయని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నుంచి విడుదల చేయాల్సిన గ్రాంటులను నిలిపివేసిందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ జమా ఖర్చులకు సంబంధించిన ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్‌లు శీలం రంగారావు, వేముల సీతారామయ్య, బట్టా సోమయ్య, ఎంపీటీసీ సభ్యురాలు జోగా మల్లేశ్వరి, గ్రామ పంచాయతి కార్యదర్శులు, వెలుగు, ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరు



పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన మాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ప్రజాపోరు ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ.. కూటమి పాలనలో నేడు రాష్ట్రంలో అధిక ధరలు, మహిళలు, పిల్లలు, దళితులపై దాడులు, హత్యాచారాలు, విద్యుత్ చార్జీల పెంపు, బ్లాక్‌మార్కెట్‌లో ఇసుక అమ్మకాలు, వీధివీధిలో మద్యం అమ్మకాలు, నిరుద్యోగం, వరద సాయం అందించలేదన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కంకిపాడు: ప్రజలపై మోపుతున్న భారాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వంలో భాగంగా ఉన్న డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పటం సిగ్గుచేటన్నారు.

ఉయ్యూరు: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్ డిమాండ్ చేశారు. ఉయ్యూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

గన్నవరం: సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందన్నారు. అనంతరం తహసీల్దారు వెంకటశివయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి

దావాజిగూడెం(గన్నవరం): సమాజంలో రక్తదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దండమూడి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎన్టీటీఎఫ్ కళాశాలలో గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దండమూడి మాట్లాడుతూ.. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను పారద్రోలాలని చెప్పారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు పండ్లు, జ్యూస్, బిస్కెట్లు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డీ మహీధర్, మేనేజర్ కె.పద్మజ, లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, క్లబ్ ప్రతినిధులు ఎంఎల్ఎస్ఆర్‌కె. ప్రసాద్, వై.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టబంధన మహాకుంభాభిషేకం ప్రారంభం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో గురువారం అష్టబంధన మహా కుంభాభిషేకం మహోత్సవాలు ప్రారంభించారు. ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 18 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయంలో మొదటి రోజు గణపతి పూజ, పుణ్యహావచనం, నాంది పంచగవ్య ప్రాసన, దీక్షా ధారణ, రుద్రక్రమార్చన, త్రిశులేశ్వరస్థాపన పలు పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ నెల 18వ తేదీన మహాకుంభాభిషేకం బ్రహ్మశ్రీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు దంపతులు తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతుకు మద్దతు ధర దక్కేలా కృషి

కంకిపాడు: రైతుకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. రైతు సేవా కేంద్రం నుంచి సేకరించిన ధాన్యం లోడు వాహనాలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జెండా ఊపి మిల్లుకు తరలించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ సీహెచ్ సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, తహసీల్దార్ వి.భావన్నారాయణ, ఏఓ పీఎం కిరణ్, రైతులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

ఉయ్యూరు: రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 8వ వార్డులో రూ 25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్ ఎంఏ బేగ్, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, పార్టీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలో పార్కు చేసిన బైక్ చోరీ

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థి పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాది ఎండీ అబ్దుల్‌అష్రఫ్ కుమారుడు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. అతను కాలేజీలో బుధవారం ఉదయం 9 గంటలకు బైక్ పార్కు చేసి తాళం తీయటం మరిచిపోయాడు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు పార్కింగ్ వద్దకు వచ్చి బైక్ చూసుకోగా బైక్ కనబడలేదు. కాలేజీ సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించగా ఉదయం 10.25 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బైక్ చోరీ చేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ముగిసిన శతచండీ యాగం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానం చినకంచిలో లోక కల్యాణార్థం గత నాలుగు రోజులుగా జరుగుతున్న శతచండీ యాగం మహాపూర్ణాహుతి గురువారం జరిగింది. ఉదయం 9 చండీయాగాలు జరగడంతో శతచండీ యాగం ముగిసింది. వేదపండితులు చెంగల్వ ఉమామహేశ్వరరావు శ్రీవల్లి దంపతులచే బాలపూజ, సువాసినీల పూజలు చేయించారు. తదుపరి రుత్వికులు మహాపూర్ణాహుతిని చేశారు. భక్తులకు, యజమానులకు అవభృత సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రుత్వికులందరినీ దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ ఘనంగా సత్కరించారు. అనంతరం మహత్ ఆశీర్వాచనం చేయగా కార్యక్రమం ముగిసింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఉచిత వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చిందని కంకిపాడు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌సీడీ–సీడీ 3.0 సర్వేను కంకిపాడులో గురువారం ప్రారంభించారు. కిషోర్‌బాబు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ పి.శివదుర్గ, ఎంపీహెచ్ఏ గుళ్లపల్లి మాధవి, వి.శ్రీధర్ కుమార్, ఆశ కార్యకర్త జి.కుమారి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



తెన్నేరులో పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ముస్తాబాదలో మాట్లాడుతున్న వక్తలు

కంకిపాడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని వక్తలు పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు తెన్నేరు శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు వెంకట రమణయ్య, చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానికులు డి.చంద్రశేకర్, ఎస్.భక్తవత్సలం, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం శివకుమారి, చరిత స్కూల్ హెచ్ఎం వేదాంతం వేదవతి, గ్రంథాలయాధికారి ఎస్.సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: పుస్తక పఠనంతో మేథోశక్తి పెరుగుతుందని ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అన్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, జెడ్పీ పాఠశాల హెచ్ఎం జ్యోత్స్నదేవి, ఎంపీపీ హెచ్ఎం విద్యావతి, నాయకులు పినమాల నాగకుమార్, సీహెచ్ కుటుంబరాజు, గ్రంథాలయాధికారి రమణి, సిబ్బంది స్రవంతి, సోని పాల్గొన్నారు.

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్పంచి నిడమర్తి సౌజన్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు, సభ్యులు చిమట రాంబాబు, సూర్యచంద్రరావు, గ్రంథాలయ ఇన్‌చార్జి పీడీ లక్ష్మి పాల్గొన్నారు.

గన్నవరంరూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ముస్తాబాద నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభ వేడుకల్లో ఆయన పాల్గొని చాచా నెహ్రూ, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయుడు దామోదర గణపతి, ఎం.విజయసారథి పాల్గొన్నారు. పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.కృపానందం ఆధ్వర్యంలో గ్రంథాలయం వారోత్సవాలు జరిగాయి.

ఉంగుటూరు: మండలంలోని మానికొండ, ఉంగుటూరు, తేలప్రోలు, ఆత్కూరు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మానికొండలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు, ఆత్కూరులో గ్రామ సర్పంచ్ భూతపాటీ ఎస్తేరమ్మ, తేలప్రోలులో సర్పంచ్ లాం దిబోర వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారులు హరికృష్ణ, కృష్ణారావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

కంకిపాడు: క్యాన్సర్‌పై అవగాహన అవసరమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను గురువారం ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత సేవలను వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ లాం సోనియా, డాక్టర్ అంజు, డాక్టర్ సాయినిఖిత, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు: క్యాన్సర్‌పై విజయం–స్క్రీనింగ్‌తో సాధ్యం కార్యక్రమం కాటూరు పీహెచ్‌సీ పరిధిలో గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శొంఠి శివరామకృష్ణ సిబ్బందితో కలిసి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ నాగార్జున, ఎంపీహెచ్ఎస్ కొలుసు శ్రీనివాసరావు, పాల్గొన్నారు. మండలంలోని బోళ్లపాడులో ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రారంభించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: క్యాన్సర్ వ్యాధి చాప కింద నీరులా విస్తరిస్తుందని, క్రమంగా పెరుగుతున్న క్యాన్సర్ బాధితుల సంఖ్య మరింత ఆందోళన కలిగిస్తుందని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి బి.రామారావు అన్నారు. బాపులపాడు, వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష, డాక్టర్ వై.కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను గురువారం ఆయన పరిశీలించారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీడీఓ జోగేశ్వరరావు, గన్నవరం సబ్ డివిజన్ మలేరియా నియంత్రణ అధికారి వెంకటరాజు, సీహెచ్‌ఓ ఫణికుమార్ పాల్గొన్నారు.



బాపులపాడులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉంగుటూరు: మండలంలో ఇందుపల్లి, ఉంగుటూరు, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి పీహెచ్‌సీ కేంద్రాల్లో క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఎన్‌సీడీ–సీడీ పోర్టల్‌లో కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆత్కూరులో క్యాన్సర్ పరీక్షల నమోదు(ఎన్‌సీడీ3.0) ఎంపీపీ వడ్లమూడి సరోజని ప్రారంభించారు. వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాసదనం నిర్మాణానికి రూ.2.50 లక్షల భక్తుల విరాళం

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న సేవాసదనం నిర్మాణానికి పలువురు భక్తులు రూ.2,50,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ గురువారం తెలిపారు. విజయవాడకు చెందిన నర్రా సత్యనారాయణ, స్వరాజ్యలక్ష్మి దంపతులు రూ.1,00,116, బుద్దవరం గ్రామానికి చెందిన ముక్కామల నరసింహారావు జ్ఞాపకార్థ ఆయన కుమారుడు జానకిరామ్ రూ. లక్ష ఇచ్చారన్నారు. గన్నవరానికి చెందిన జాస్తి పిచ్చియ్య, వసుంధర దంపతులు రూ.50 వేలు విరాళం అందజేసినట్లు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి, సేవా సదనం నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకువస్తున్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.



విరాళం నగదు అందజేస్తున్న భక్తులు

ఘనంగా బాలల దినోత్సవం

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఎస్ఐ సత్యసుధాకర్ పాల్గొని మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. బాలలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్ఐ ఉషారాణి బహుమతులు అందజేశారు. నవజీవన్ బాలభవన్ కో ఆర్డినేటర్ జె.జ్యోతి, ఎస్‌కె.నజ్మా, హెచ్ఎం పి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పెనమలూరు గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో తొలుత చాచా నెహ్రూ, గ్రంథాలయాల వ్యవస్థాపకుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయలన్నారు. గ్రంథాలయ అధికారులు పి.హరీష, చక్క గోపీకృష్ణ, భారతి, ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ పాల్గొన్నారు. యనమలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్‌కెనగర్ స్పార్క్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా చేశారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి 100 మంది విద్యార్థులకు లయన్స్ గవర్నర్ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, లయన్స్ అధ్యక్షుడు డాక్టర్ బావిశెట్టి రమేష్, సైకాలజిస్టు రమాదేవి, హెచ్ఎం వై.శ్రీనివాస్, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకిపాడు: మత్తుకు బానిసలు కావొద్దని, జీవితాన్ని ఛిద్రం చేసుకోవద్దని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జె.జ్యోతిచంద్రిక అన్నారు. విజయవాడ నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కంకిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు పొగాకు–ఆరోగ్యంపై ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. జ్యోతి చంద్రిక మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకూ విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఎం జీబీకే సుధారాణి, నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో టి.ప్రవల్లిక, కె.పావని, ఈ.జ్యోతిర్మయి విజేతలుగా నిలిచారు.



పెనమలూరు వేడుకల్లో పాల్గొన్న ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం ఎంపీపీ పాఠశాల(మోడల్ ఫౌండేషన్ స్కూల్)లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎంపీడీఓ టి.స్వర్ణలత నివాళులర్పించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓలు కొండా రవికుమార్, రామావత్ కమల, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్నవరంరూరల్: ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా, కరస్పాండెంట్ ఇమాం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సావరగూడెంలో సామాజిక వేత్త లంకా గంగాధర్‌రావు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రామవరప్పాడు: రామవరప్పాడులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో బాలల దినోత్సవ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథిగా మహిళా ఎస్ఐ ఎ. దుర్గాదేవి హాజరై ఆటపాటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మవాణి, పాఠశాల ఇన్‌చార్జి వేణు, కీర్తి, దుర్గ, కొత్తమాసు త్రివేణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గన్నవరంలో బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ స్వర్ణలత

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, సహ పంక్తి భోజనాలను బాలబాలికలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. దేశ తొలిప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఏఎస్ఐ రాజు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, హెచ్ఎం తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి స్కూల్ కమిటీ చైర్మన్ గద్దం కుమార్, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. పడమర బజారులోని మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సాంబిరెడ్డి దంపతులు సొంత నిధులతో బహుమతులను అందచేశారు. స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.